క్లుప్తంగా

అలరించిన గీతాలాపన


గీతాలాపన చేస్తున్న నాగజ్యోతి బృందం

కొమ్మాది: సాగర్‌నగర్‌లో గల శ్రీ మోగదారమ్మ మహాలక్ష్మి పద్మాలయం కళావేదిక వద్ద ఆదివారం సాయంత్రం రాగా మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో కె.నాగజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన గీతాలాపన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మహాలక్ష్మి అమ్మవారి పాటలు, శ్రీకృష్ణుని గీతాలు భక్తులను అలరించాయి.

శాస్త్రోక్తంగా రాట మహోత్సవం


రాట మహోత్సవంలో ఉత్సవ కమిటీ సభ్యులు

కొమ్మాది: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు జీవీఎంసీ 8వ వార్డు గొల్లల ఎండాడలో గోపాలకృష్ణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం శాస్త్రోక్తంగా ఉత్సవ రాట మహోత్సవం నిర్వహించారు. నవరాత్రులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

నిత్యావసర సరకుల పంపిణీ


పేదలకు సరకులు అందిస్తున్న లక్ష్మీనారాయణ

మధురవాడ: మధురవాడ వాంబే కాలనీ వద్ద జీసస్ మిరాకిల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. 50 మందికి ట్రస్ట్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పట్నాయక్ సరకులు అందించారు. కార్యదర్శి లక్ష్మి పట్నాయక్, సభ్యులు సువర్ణరాజు, రాము, శాంతి, ఉమా, మెర్సీ పద్మ పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు


శ్రావణలక్ష్మి పూజలో పాల్గొన్న భక్తులు

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ మాసోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు ఆదివారంతో 24వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వర సుస్వరాల మధ్య పూజలు ప్రారంభించారు. 12 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టుల ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె.రాజేంద్రకుమార్, సహాయ ఇంజినీర్ డీఈఎస్ రామరాజు, పర్యవేక్షకుడు తిరుపతిరావు, వేదపండితులు ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం


యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.


ప్రస్తుతం చిన్నపాటి చెరువును తలపిస్తున్న తుమ్మిరిగెడ్డ మినీ రిజర్వాయర్

మహా నిర్లక్ష్యం

తుమ్మిరిగెడ్డ మినీ రిజర్వాయర్‌ను పట్టించుకోని అధికారులు ■ 'నిండడం - ఎండడం'... దశాబ్దాలుగా ఇదే తంతు

- తాగునీటి అవసరాలకు వినియోగించడంలో విఫలం
- విహార కేంద్రంగా అభివృద్ధికి అనుకూల వాతావరణం
- ఆ దిశగా అధికారులు, పాలకుల చర్యలు శూన్యం

పీఎం పాలెం: మనసును పులకింపజేసే చూడచక్కని ప్రకృతి అందాల నడుమ అలరారుతున్న తుమ్మిరి గెడ్డ మినీ రిజర్వాయర్ పాలకులు, అధికారుల మహా నిర్లక్ష్యం కారణంగా అడవికాచిన వెన్నెల చందంగా దశాబ్దాల తరబడి నిరుపయోగంగా మారింది. ఈ రిజర్వాయర్‌ను ప్రజా అవసరాలకు వినియోగించుకోవడంలో జీవీఎంసీ నూరు శాతం విఫలమైందనడంలో సందేహమే లేదు. వర్షాకాలంలో నిండుకుండలా నీటితో కళకళలాడడం... వేసవిలో చుక్క నీరు లేక కళావిహీనంగా తయారవడం... ఇదే దశాబ్దాలుగా ఈ మినీ రిజర్వాయర్ పరిస్థితి. చెక్‌డ్యామ్ ఏర్పాటు చేసి సుమారు 50 సంవత్సరాలు గడిచినా నగర వాసులకు ఇటువంటి రిజర్వాయర్ ఒకటి ఉందన్న సంగతి తెలియదు. పీఎం పాలెం ఆఖరు బస్టాప్‌నకు సుమారు కిలోమీటరు దూరంలో కంబాలకొండ అటవీ పరిధి శంభువానిపాలెం గిరిజన గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఆనుకుని 1976లో ఈ మినీ రిజర్వాయర్ నిర్మించారు. మధురవాడ, పీఎం పాలెం, లక్ష్మీవానిపాలెం, బక్కన్నపాలెం, తదితర గ్రామాల ప్రజల వ్యవసాయ అవసరాలకు నీటిని వినియోగించుకుని జీవించేవారు. పట్టణీకరణ ప్రభావంతో ఈ ప్రాంతంలో వ్యవసాయం అటకెక్కింది. వ్యవసాయ భూములు నివాస భూములుగా మారిపోయాయి. ఈ ప్రాంతంలో ఉన్న సుమారు 14 గ్రామాలు జీవీఎంసీలో విలీనమయ్యాయి. సుమారు ఆరు వేల ఎకరాల ఆయకట్టు భూములను శశ్యశ్యామలం చేయడానికి రిజర్వాయర్ నిర్మించగా తదనంతర పరిణామాలతో ఆ లక్ష్యం నెరవేరలేదు. అయితే పెరిగిన జనాభా తాగునీటి అవసరాలను ఈ రిజర్వాయర్ సాయంతో తీర్చవచ్చనే ఆలోచన ఇన్ని దశాబ్దాలు గడిచినా అధికారులు, పాలకులకు రాకపోవడం గమనార్హం.


శిథిలావస్థకు చేరుకున్న మదుము


తుమ్మిరిగెడ్డ మినీ రిజర్వాయర్‌పై గతంలో వేసిన సినిమా సెట్టింగ్

ఇలా అభివృద్ధి చేస్తే...

- ప్రకృతి అందాలకు నెలవైన తుమ్మిరిగెడ్డ మినీ రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి. ఫలితంగా ఎంతో మందికి ఉపాధి లభించడంతోపాటు జీవీఎంసీకి ఆదాయ వనరుగా మారుతుంది.
- రిజర్వాయర్ చుట్టూ కంచె నిర్మించాలి.
- గట్టు పొడవునా పేరుకుపోయిన తుప్పలు, డొంకలు తొలగించాలి.
- నిర్మించిన గట్టు వెంబడి పర్యాటకులు సేద తీరేందుకు అవసరమైన ఆకర్షణీయ నిర్మాణాలు చేపట్టాలి.
- పాత మదుము తొలగించి రిజర్వాయర్‌లోకి అదనంగా చేరే నీరు బయటకు వెళ్లేలా చెక్‌డ్యామ్‌లు నిర్మించాలి.


నిండుకుండలా కళకళలాడుతున్న తుమ్మిరి గెడ్డ మినీ రిజర్వాయర్ (ఫైల్)

వానా కాలంలో నిండి.. వేసవి కాలంలో ఎండి..

కొండ కోనల్లో ఉన్న తుమ్మిరి గెడ్డ, ఊట గెడ్డలలో ప్రవహించే నీటి ప్రవాహాలు వేలాది ఎకరాల గర్భం కలిగిన తుమ్మిరిగెడ్డ మినీ రిజర్వాయ్‌లో చేరుతాయి. రిజర్వాయర్‌కు మూడు వైపులా ప్రకృతి సిద్ధంగా నీరు నిల్వ చేసుకోవడానికి అనుకూలంగా ఉండడంతో రెండు కొండల నడుమ గట్టు నిర్మించి రిజర్వాయర్‌కు అప్పటి ఇంజినీర్లు రూపకల్పన చేశారు. మరింత గట్టిదనం కోసం లోపల వైపు రాతి కట్టు కూడా నిర్మించారు. రిజర్వాయర్‌లోని నీటిని వ్యవసాయ అవసరాలకు ప్రవహింపజేయడానికి వీలుగా మదుము నిర్మించారు. జలాశయంలోని నీరు బయటకు వృథాగా పోకుండా గేట్లు అమర్చారు. అనంతరం కాలంలో మదుము, గేట్లు శిథిలమయ్యాయి. ఫలితంగా జలాశయంలోకి చేరుతున్న నీటిని నిలువరించే సామర్థ్యం లేకపోవడంతో వృథాగా పోతోంది. ఈ కారణంగా రిజర్వాయర్‌కు దిగువన ఉన్న పీఎం పాలెం, మధురవాడ, ఉడా కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీల్లో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. బోర్లు, బావులు ఎండిపోయి నీటి సరఫరాకు మొండికేస్తున్నాయి. 500 అడుగుల లోతుకు వెళ్లినా నీరు లభ్యం కాని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా ఇదే పరిస్థితితో ఇబ్బంది పడుతున్నామని... తుమ్మిరిగెడ్డ మినీ రిజర్వాయర్‌లో నీటిని నిల్వ చేసి ప్రజా అవసరాలకు వినియోగిస్తే ఎందరికో మేలు జరుగుతుందని స్థానికులు అంటున్నారు. ముఖ్యంగా ప్రకృతి సహజంగా సమకూరిన నీటిని సద్వినియోగం చేసుకోవడంలో మహా విశాఖ నగరపాలక సంస్థ విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

విహార కేంద్రంగా తీర్చిదిద్దాలి



జీవీఎంసీ 6, 7 వార్డుల పరిధిలో జనాభా విపరీతంగా పెరిగారు. ఈ ప్రాంతంలోని తుమ్మిరిగెడ్డ మినీ రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి. ఆహ్లాదకర వాతావరణం, ప్రకృతి అందాలు ప్రజలు, పర్యాటకులు తిలకించేలా సౌకర్యాలు కల్పించాలి. జలాశయం నుంచి చుక్క నీటి బొట్టు వృథా కాకుండా నగరవాసుల తాగునీటి అవసరాలకు వినియోగించాలి. –టి.సూర్యనారాయణ, పిలకవానిపాలెం

పూడిక తొలగించక పొలాలకు చేరని నీరు

ఆందోళనలో గుడిలోవ చానల్ కాలువ పరిధిలోని రైతులు

తగరపువలస: ఆనందపురం మండలం గుడిలోవ చానల్ కాలువ పూడికతీత పనులు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అరకొరగా సాగాయని, అందువల్లే చాలా పంచాయతీలకు సాగునీరు అందకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చానల్ కింద సుమారు రెండువేల ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. వర్షాధారమైన పొలాలకు సాగునీరు ఈ చానల్ ద్వారా అందాల్సి ఉందన్నారు. దీనిపై కూటమి నాయకులు, ఇరిగేషన్ అధికారులు శ్రద్ధ చూపకపోవడంతో పాలవలస, ఆనందపురం, బంటుపల్లి కళ్లాలు, పాడుగుపాలెం గ్రామాల రైతులకు సాగునీరు అందడం లేదంటున్నారు. గుడిలోవ నుంచి నేరుగా పెద్దిపాలెం వరకు కాలువ పూడికతీత పనులు చేసి మార్గ మధ్యలో చెరువులకు వెళ్లే మార్గాల్లో పూడికతీత పనులు చేపట్టలేదన్నారు. కొందరి నిర్లక్ష్యం కారణంగా గుడిలోవ చానల్ కింద ఉన్న ఆనందపురం పూర్లవాని చెరువు, పాడుగుపాలెం చింతలవాని చెరువు కాలువ మార్గాల పూడికతీత పనులు జరగలేదన్నారు. గతంలో ఈ చెరువులకు అనుసంధానంగా కాలువ పూడికతీత పనులు జరగడం వల్ల రైతులు రెండు పంటలు సాగు చేసుకునేవారన్నారు. ఈ సంవత్సరం వర్షాలు ఆలస్యమవడంతోపాటు పూడికతీత పనులు చేపట్టకపోవడంతో ఒక పంట కూడా పండుతుందో లేదోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టులో కురుస్తున్న వర్షాలకు తోడు పూడిక తీత పనులు పూర్తిగా చేయనందున ఈ నీరు నేరుగా సముద్రంలో కలిసి పోతుందంటున్నారు. వర్షాలు రాలేదన్న ఆందోళనతో రైతులు వరి నాట్లు వేయడంలో ఆలస్యం చేశారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా రైతులకు సబ్సిడీపై ఎరువులు అయినా ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు.


పూడిక సరిగా తొలగించని గుడిలోవ కాలువ

హరేకృష్ణ వైకుంఠంలో వైభవంగా నందోత్సవం

వ్యాసపూజతో ముగిసిన కృష్ణాష్టమి ఉత్సవాలు


శ్రీభక్తి వేదాంత స్వామి ప్రభుపాదులు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంపీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీరాధా మధన్ మోహన మందిరంలో ఆదివారం వైభవంగా నిర్వహించిన నందోత్సవం, వ్యాసపూజతో కృష్ణాష్టమి ఉత్సవాలు ముగిశాయి. నందమహారాజుకు పుత్రుడు జన్మించిన ఆనందంతో అప్పట్లో బృందావనవాసులకు విందు ఏర్పాటు చేశారని హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస తెలిపారు. ఈ సంప్రదాయం ప్రకారం ఆదివారం భక్తులకు రకరకాల పిండివంటలతో విందు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. భక్తులు తమ ఇష్టదైవమైన శ్రీకృష్ణ భగవానుని దర్శనం అనంతరం ప్రసాదాలు స్వీకరించారు. అలాగే శ్రీభక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు శ్రీకృష్ణజన్మాష్టమి తర్వాత ఆవిర్భవించారని, అందువల్ల ఈ రోజును వ్యాసపూజగా శ్రీకృష్ణ భక్తులు విశ్వవ్యాప్తంగా నిర్వహిస్తారన్నారు. అందులో భాగంగా శ్రీభక్తి వేదాంత స్వామి ప్రభుపాదుల వారికి సప్తనదుల నుంచి సేకరించిన జలాలు, పండ్ల రసాలు, పంచామృతాలు, వేదమంత్రాల నడుమ అభిషేకం నిర్వహించారు. భీమిలికి చెందిన కృష్ణ కూచిపూడి నిత్య నిలయం, శివ సంస్కృతి ఆర్ట్స్ అకాడమీ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. హరినామ జప మండపంలో 108 పలకలతో ఏర్పాట్లు జరిగిన చోట భక్తులు ప్రశాంతంగా పాల్గొన్నారు. కార్యక్రమాలు ముగిసినట్టు అంబరీష దాస తెలిపారు.


ప్రత్యేక అలంకరణలో శ్రీరాధామదన్‌మోహన్

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికై పోరాటం

- అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా 10వ మహాసభలో రాష్ట్ర కార్యదర్శి చంద్రావతి
- జిల్లా కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక


సిటు మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి చంద్రావతి

సబ్బవరం: అంగన్‌వాడీలకు కనీస వేతనాలు అమలు చేసి, వారి సమస్యలను పరిష్కరించకపోతే పోరాటానికి సిద్ధమని సిటు రాష్ట్ర కార్యదర్శి చంద్రావతి హెచ్చరించారు. స్థానిక సీతారామ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సిటు) 10వ జిల్లా మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ వర్కర్లు గ్రామాల్లో మాతా శిశు మరణాలను తగ్గించి పిల్లలకు కౌమార విద్యను అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి అంగన్‌వాడీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకపోవడం శోచనీయమన్నారు. గత ప్రభుత్వంలో 42 రోజుల పాటు సమ్మె చేయగా, వేతనాల పెంపు, గ్రాట్యుటీ చట్టాల అమలు హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. అప్పుడు ప్రతిపక్షంగా ఉన్న టీడీపీ నేతలు సమ్మె శిబిరాలకు వచ్చి అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తామని, వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలు హామీలు గుప్పించి, అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినా కనీసం పట్టించుకోవట్లేదని ఆక్షేపించారు. అంగన్‌వాడీల కనీస విధులతోపాటు, అదనపు బాధ్యతలు, యాప్‌ల పేరిట వేధించడం సరికాదన్నారు. సమస్యల పరిష్కారానికి పోరాటాన్ని ఉధృతం చేస్తామని, అంగన్‌వాడీలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిటు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, జిల్లా కోశాధికారి వీవీ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ మహాసభలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల సమస్యలు పరిష్కరించండి

మహారాణిపేట: స్టేట్ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.జె.గణేష్‌కుమార్ కోరారు. ఆదివారం విశాఖలో మునిసిపల్ డైరెక్టర్ పర్సనల్ సెక్రటరీ ఉదయ్ భాస్కర్‌ను సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలు విన్నవించారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలపై ఎంతో అవగాహన కలిగిన ఉదయ భాస్కర్ మునిసిపల్ డైరెక్టర్ పర్సనల్ సెక్రటరీగా నియమితులు కావడం తమ అదృష్టమన్నారు. ఆయనకు శాలువా కప్పి సన్మానించి, పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు.

ఎడతెగని వాన

పంటలకు నష్టం, రోడ్లు ఛిద్రం


ముచ్చర్ల వద్ద నీట మునిగిన పంట పొలాలు


గిడిజాల వద్ద నీళ్లకుండీలు-విజయనగరం రహదారిపై నుంచి ప్రవహిస్తున్న వర్షంనీరు


మిందివానిపాలెం వద్ద మునిగిన జాతీయ రహదారి, సర్వీస్‌రోడ్లు

తగరపువలస: శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా భీమిలి, ఆనందపురం మండలాల్లో రహదారులు ధ్వంసం కాగా పంటపొలాలు నీట మునిగాయి. రెండు రోజుల క్రితం వరకు వర్షం జాడలేక వరి నారు, ఆకు కూరలు, కూరగాయల పంటలు ఎండిపోతుండటంతో గగ్గోలు పెట్టిన రైతులు ఇప్పుడు కురుస్తున్న కుండపోత వర్షానికి దిక్కులు చూస్తున్నారు.

- ఆనందపురం మండలంలో పలు పంచాయతీల్లో గెడ్డలు కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టడంతో దీని ప్రభావం ఇప్పుడు కనిపిస్తోంది. కొండలపై కురిసిన వర్షం చెరువుల్లోకి చేరే క్రమంలో గెడ్డలు సరిగాలేక గంటల తరబడి రహదారులపై నిలిచిపోతోంది. అందుబాటులో ఉన్న వ్యవసాయ భూముల్ని వర్షం నీరు ముంచెత్తింది. ఆకుకూరలు, కూరగాయలు, పువ్వుల తోటలకు భారీ నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోతున్నారు.
- ఆనందపురం మండలంలో నీళ్లకుండీల నుంచి విజయనగరం వెళ్లే రహదారిలో చిన్నగా ఉన్న గుంతలు భారీ వర్షానికి మరింత పెద్దగా మారాయి. వర్షంనీరు రహదారిపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రోడ్లు చెరువుల్ని తలపిస్తున్నాయి. పలుచోట్ల వాహనాలు వర్షానికి కదలకుండా రహదారులపై నిలిచిపోయాయి.
- ఆనందపురం మండలంలో ఆదివారం కురిసిన వర్షానికి పలుచోట్ల సర్వీస్‌రోడ్లు, జాతీయరహదారులు నీట మునిగాయి. శొంఠ్యాం పంచాయతీ మిందివానిపాలెం వద్ద రియల్ ఎస్టేట్ భూముల నుంచి పొంగుకు వచ్చిన వర్షం నీటితో సుమారు 300 మీటర్ల మేరకు సర్వీస్‌రోడ్డు, హైవే, డివైడర్లు మునిగిపోయాయి. మూడు అడుగుల మేరకు గెడ్డనీరు హైవేపై నిలిచిపోవడంతో రెండు గంటలపాటు వాహనాలు నిలిచిపోయాయి. పలు వాహనాలు మొరాయించాయి. వేములవలస, వెల్లంకి, పెద్దిపాలెం, పాలవలస, తర్లువాడ, గుడిలోవ, శొంఠ్యాం గ్రామాల వద్ద సర్వీస్‌రోడ్లపై నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు సంగివలస, సబ్బివానిపేట గ్రామాల వద్ద సర్వీస్‌రోడ్లపై పెద్ద ఎత్తున వర్షం నీరు చేరడంతో విశాఖ నుంచి తగరపువలస కూడలిలోకి వచ్చే వాహనాలు ఊరి బయటే నిలిచిపోయాయి.
- శొంఠ్యాం పంచాయతీ ఆబోతువానిపాలేనికి అనుసంధానంగా నిర్మాణంలో ఉన్న రహదారి స్థానిక గెడ్డ నుంచి వరద నీరు పొంగి ప్రవహించడంతో తుడిచిపెట్టుకుపోయింది. రెండేళ్ల క్రితం ఇదే గెడ్డ పొంగిపొర్లడంతో ఒక బాలుడు గల్లంతైన విషయం తెలిసిందే. ప్రస్తుతం గెడ్డ పొంగడంతో కణమాం పంచాయతీలోని గ్రామాలు, ఆబోతువానిపాలేనికి రాకపోకలు నిలిచిపోయాయి.

కొమ్మాది: భారీ వర్షంతో తీరప్రాంతాల్లో జనజీవనం స్తంభించింది. ఉదయం నుంచి ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అనేక చోట్ల విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రుషికొండ, తిమ్మాపురం, మంగమారిపేట, చేపలుప్పాడకు చెందిన మత్స్యకారులు వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో వేటకు విరామం ఇచ్చారు. పరదేశిపాలెం నుండి కాపులుప్పాడకు రాకపోకలు నిలిచిపోయాయి. వరద నీటి ప్రభావంతో బోర రామరెడ్డి, పట్టణాల మరిడయ్యలకు చెందిన 4 ఎకరాల వరిపంట నీట మునిగింది. కొమ్మాది గెడ్డ పొంగిపొర్లుతోంది.

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం కురిసిన భారీ వర్షాలకు పంట పొలాలు నీట మునిగాయి. మద్ది, కృష్ణాపురం, కోరాడ పంచాయతీ గెడ్డపేట, విలాస్కాన్‌పాలెం మరికమ్మ చెరువు కింద వరి నాట్లు నీటి ముంపునకు గురయ్యాయి. మదిలో వరి నాట్లు వేసిన పొలాలు చెరువుల్ని తలపిస్తున్నాయి. రూ.వేలు పెట్టుబడిగా పెట్టి వేసిన వరి నాట్లు, సరుగుడు మొక్కలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

భీమునిపట్నం: భీమిలిలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి పరిస్థితి దారుణంగా మారింది. మిగిలిన ప్రాంతాలకన్నా ఇక్కడి పరిస్థితి కాస్త భిన్నం. నరసింహస్వామి కొండ నుంచి సముద్రం వరకు ఊరు మొత్తం వాలుగా ఉంటుంది. అప్పట్లో బ్రిటీష్ వారు కాలువలు వెడల్పుగా, బాగా లోతుగా నిర్మించారు. దీంతో ఎంత పెద్ద వర్షం కురిసినా నీరు నిలవకుండా సముద్రంలోకి వెళ్లిపోతుంది. తగరపువలస రోడ్డులో పరిస్థితి మాత్రం ఇబ్బందికరంగా ఉంది. ఇక్కడ జమ్మిచెరువు పార్కు దాటిన తర్వాత ఇరువైపులా సరైన కాలువల్లేవు. దీంతో భారీ నీ రు రోడ్లపై నిలిచి, వా హనదారులకు ఇబ్బంది కరంగా మారింది. పక్కనే ఉన్న ఫుట్‌బాల్ మైదానంలో కూడా నీరు భారీగా నిలిచిపోయింది. దీనికి శాశ్వత పరిష్కారం చూపా లని స్థానికులు కోరుతున్నారు.

పీఎం పాలెం: రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి పీఎం పాలెంలోని రహదారులు జలమయం అయ్యాయి. గాయత్రీనగర్ జేఎస్ఎస్‌యూఆర్ఎం కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, ఆర్‌హెచ్ కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. చిరు వ్యాపారస్తులు దుకాణాలు తెరవ లేదు.


తగరపువలస రోడ్డులో భారీగా నిలిచిన వర్షపు నీరు


కార్‌షెడ్ నుంచి పీఎం పాలెం ఆఖరు బస్‌స్టాప్‌కు వెళ్లే రోడ్డులో పరిస్థితి


ఆనందపురం మండలం బోని వద్ద ధ్వంసమైన రహదారి


సబ్బివానిపేట వద్ద నీట మునిగిన సర్వీస్‌రోడ్డు


సాగర్‌నగర్ వద్ద నీట మునిగిన చార్జింగ్ పాయింట్


పరదేశిపాలెంలో నీట మునిగిన వరి నాట్లు


వరద నీటితో నిండిపోయిన కొమ్మాది చెరువు


ఫుట్‌బాల్ మైదానంలో నిలిచిపోయిన నీరు


మద్దిలో నీటి ముంపునకు గురైన సరుగుడు మొక్కలు


గెడ్డపేటలో నీటి ముంపునకు గురైన వరి నాట్లు